క్లుప్తంగా

మలేరియా నివారణపై అవగాహన



మిడ్జిల్: జాతీయ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంతో పాటుగా దోనూర్, కొత్తపల్లి గ్రామాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. మలేరియా నివారణకు ప్రజలు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటి ముందు ఉన్న నీటి తొట్లలలో నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ అయ్యూబ్‌ఖాన్, ప్రసాద్, దేవయ్య, సంపత్, జంగయ్య, శ్రీదేవి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ ప్రారంభం



జడ్చర్ల టౌన్: ఆటపా ఆధ్వర్యంలో పదో తరగతికి వెళ్తున్న విద్యార్థులకు ముందస్తుగా ఏర్పాటు చేసిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ మంజులాదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఉదయ మెమోరియల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆటపా శిక్షణను ఆమె ప్రారంభించారు. ఇష్టంగా చదివితే అన్ని అనుకున్న ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఉదయ మెమోరియల్ హైస్కూల్ నిర్వహకురాలు వీణశివకుమార్, తిమ్మాజిపేట ఎంఈఓ సత్యనారాయణ శెట్టి, ఆటపా అధ్యక్షుడు ఎలిశెట్టి మురళికృష్ణలతో పాటు ఆటపా బాధ్యులు, 200మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వినోదాత్మక విజ్ఞాన వేసవి శిబిరం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సద్దాల హనుమంతు సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో మే 3వ తేదీ నుంచి వినోదాత్మక విజ్ఞాన వేసవి శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం గౌరవ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, బెక్కం జనార్దన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సుశ్రుత ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 10 ఏళ్లు దాటిన విద్యార్థులు పలు విభాగాల్లో శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల వారు 82470827738, 7396021638 నెంబర్లకు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కురుమయ్య, ప్రమోద్, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ నాయకులే అతిథులు

నవాబుపేట: తెలంగాణ ఉద్యమ పోరాటంలో ముందున్న వారు, కేసీఆర్ ఏర్పాటు చేసిన గులాబీ సైన్యంలో ఉన్న వారే ముఖ్య అతిథులుగా పార్టీ జెండాలు ఎగరేసి జెండా పండగలు జరుపుకోవాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం, రజతోత్సవ కార్యక్రమాల్లో భాగంగా శనివారం ప్రతి గ్రామంలో గులాబీ జెండాలు ఎగరేయాలన్నారు. మండలంలో అన్ని గ్రామంలో ఇప్పటికే జెండా పండుగలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమాల్లో మండల ముఖ్య నాయకులు ఆయా గ్రామాల్లో పర్యటిస్తారని ఆయన వివరించారు.

‘భూ భారతి’తో సమస్యలు పరిష్కారం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



మాచన్‌పల్లిలో భూ భారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: భూ భారతి చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనిఏ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మాచన్‌పల్లిలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే, కలెక్టర్ విజయేందిర బోయిలు హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో పలు రకాల భూ సమస్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని, ఈ క్రమంలో రానున్న రోజుల్లో అనేక భూ సమస్యలకు భూ భారతి వల్ల పరిష్కారం లభించనుందన్నారు. రూరల్ మండలంలో 900 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి అని, అవి పూర్తి కాగానే త్వరలో మరికొందరికి ఇందిరమ్మ ఇళ్లు వస్తాయన్నారు.

భూ భారతి చట్టంతో పారదర్శక సేవలు

భూ సమస్యలను మరింత పారదర్శకంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమలు చేస్తుందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గ్రామాల్లో చాలా భూ సమస్యలు ఉన్నాయని, ప్రజావాణిలో 80 శాతం భూ సమస్యలు దరఖాస్తులు వస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, అదనపు కలెక్టర్ మోహన్‌రావు, డీఆర్‌డీఓ నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, ఆర్డీఓ నవీన్, తహసీల్దార్ సుందర్‌రాజ్, ఎంపీడీఓ సుధాశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నగర అభివృద్ధే ధ్యేయం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగర అభివృద్ధే తమ ధ్యేయమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 35, 36, 45, 47, 48, 49వ డివిజన్ల పరిధిలో టీయూఎఫ్‌ఐడీసీ నుంచి మంజూరైన రూ.2.80 కోట్లతో చేపట్టే వివిధ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే నగరంలోని అన్ని వీధుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తున్నామన్నారు. అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్ రెడ్డి, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఎన్పీ వెంకటేశ్, సీజే బెన్‌హర్, సాయిబాబా, చిన్నా, ఖాజాపాషా, రాషెద్, లక్ష్మణ్ నాయక్, ఉమర్‌పాషా, హనుమంతు, ఎంఐఎం నాయకుడు సాదతుల్లా తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పదోడివిజన్ పరిధిలోని క్రిస్టియన్‌పల్లిలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్



చౌదర్‌పల్లి పెద్దతండాలో డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర

మహమ్మదాబాద్: గ్రామాల అభివృద్ధిలో గ్రామ కార్యదర్శితో బాటు అధికారులు నిత్యం భాగస్వాములు కావాలని లోకల్‌బాడీస్ అదనపు కలెక్టరు శివేంద్రప్రతాప్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నంచర్ల, పెద్దతండాల గ్రామ పంచాయతీలను పరిశీలించారు. గ్రామాల కార్యదర్శులకు రెగ్యులరైజేషన్ కావడంతో వారి పనితీరు గ్రామాల అభివృద్ధిపై పరిశీలించారు. డంపింగ్ యార్డు, సెగ్రిగేషన్ షెడ్లు, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. నర్సరీల పెంపకం మొక్కలు నాటి పెంచిపోషించడంపై ఆయన ఆరా తీశారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధవహించి పరిశుభ్రత తాగునీరు నిత్యం పరిశీలించాలని సూచించారు. ఆయన వెంట గండేడ్ ఎంపీడీఓ దేవన్న, మహమ్మదాబాద్ ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

బ్యాంకర్లతో సమన్వయ సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం జడ్చర్ల మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని బ్యాంకర్లతో నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాజీవ్ యువ వికాస్ దరఖాస్తుల వివరాలను బ్యాంకర్లకు అందించారు. వారిలో అర్హులైన వారిని నిర్దేశిత లక్ష్యాల మేరకు ఎంపిక చేయాలని సూచించారు. ప్రభుత్వమే పూర్తిస్థాయిలో యువ వికాస్‌కు నిధులు కేటాయిస్తున్నందున బ్యాంకు పరిధిలోని గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్ ఆయా బ్యాంకర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



అడ్డాకుల: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురి కావొద్దని అడ్డాకుల ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ సూచించారు. మండలంలోని శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. అతివేగంగా వాహనాలు నడపొద్దని, రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సురెన్స్ తప్పక కలిగి ఉండాలని చెప్పారు. అడ్డాకుల బస్టాండ్ ఆవరణలో సైబర్ నేరాలపై ఏఎస్‌ఐ రాజేశ్వర్ రావు ప్రయాణికులకు అవగాహన కల్పించారు. అపరిచితులకు బ్యాంకు వివరాలు, ఓటీపీలను షేర్ చేయొద్దని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

జడ్చర్ల: స్థానిక 6వ వార్డులో శుక్రవారం కౌన్సిలర్ రమేశ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేపట్టారు. ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న జాబితాకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో మున్సిపల్ సిబ్బంది వివరాలు సేకరించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ వైష్ణవి, కృష్ణారెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు లక్ష్మయ్య, రాజీవ్, బాల్‌రాజ్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో అక్రమాలు జరగలేదు

మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఎలాంటి అక్రమాలు జరగలేదని ప్రిన్సిపాల్ లక్ష్మీబాయి తెలిపారు. గురువారం పాఠశాల గురించి పలుపత్రికల్లో వచ్చిన కథనాలు అవాస్తవమని పత్రికావిలేకర్ల సమావేశంలో శుక్రవారం తెలిపారు. పాఠశాలకు చెందిన రైస్, కూరగాయలు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నామని తెలిపారు. పాతసామగ్రి ఎక్కడా అమ్ముకోలేదని, ఎవరు తనిఖీ చేసినా సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ విషయాన్ని డీఈఓకు కూడా తెల్పుతామని పాఠశాల సిబ్బంది తెలిపారు. కావాలనే కొందరు పనిగట్టుకుని పాఠశాలను బదనాం చేస్తున్నారని, అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఉన్నారు.

భవిష్యత్ బీఆర్‌ఎస్ పార్టీదే

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాజీ ఎంపీటీసీని పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు విసుగు వచ్చిందని, భవిష్యత్ బీఆర్‌ఎస్ పార్టీదేనని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారంఆ పార్టీ కార్యాలయంలో ధర్మాపూర్ మాజీ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆయన ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు పార్టీలు మారిన వాళ్లు తిరిగి బీఆర్‌ఎస్‌పార్టీలోకి రావడమంటేనే భవిష్యత్ బీఆర్‌ఎస్ అని అర్థం అవుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

- దోమల నుంచి కలిగే వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణ



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణ

పాలమూరు: దోమకాటు వల్ల కలిగే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, ఇంట్లో పరిసరాలు పరిశుభ్రంగా పెట్టుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ డాక్టర్ కృష్ణ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రామయ్య బౌళి దగ్గర ఏర్పాటు చేసిన ర్యాలీని డీఎంహెచ్‌ఓ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రధానంగా నీటిని నిల్వ ఉంచరాదని, నీళ్ల కుండీలు, చెత్త డబ్బాలు, వాటర్ ట్యాంక్‌లను తరచూ శుభ్రం చేసుకోవాలన్నారు. దేశంలో 2030నాటికి మలేరియా నిర్మూలించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శశికాంత్, జిల్లా క్షయ నియంత్రణ అధికారి మల్లికార్జున్, శ్రీధర్‌రెడ్డి, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

కడుపు మండుతున్న కనికరం లేదా?

- నెలల తరబడి మీకు జీతాలు రాకుంటే పని చేస్తారా?
- కలెక్టరేట్ ముందు ఉపాధి కూలీల ధర్నా



కలెక్టరేట్ ప్రధాన గేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉపాధి హామీ కూలీలకు మూడు నెలలుగా జీతాలు రాక కడుపు మండుతున్న ప్రభుత్వానికి కనికరం లేదా? అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మోహన్ అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్ డబ్బులు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడుపు కాలుతున్న కనికరం లేదా? నెలల తరబడి జీతాలు రాకుంటే మీరు పనిచేస్తారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు మంచి నీరు, టెంటు, ప్రాథమిక చికిత్స కోసం మెడికల్ కిట్లు పని ప్రదేశాలలో కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో జాబ్ కార్డులు 137,407 ఉండగా కూలీల సంఖ్య 2,26,377 మంది ఉండగా, యాక్టివ్‌గా ఉన్న జాబ్ కార్డులో 89,155, వాటిలో లక్ష 34,275 మంది మాత్రమే పని చేస్తున్నారన్నారు. ఇన్ యాక్టివ్ పేరుతో తొలగించిన 40,252 జాబ్ కార్డులను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు గోపాల్, జిల్లా కార్యదర్శి కురుమూర్తి మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం పేదలకు కనీసం కూలీ డబ్బులు ఇవ్వకుండా, కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రుణ రాయితీ ప్రకటించడం సరికాదన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్‌డీఏ, ఏఓ వి నారాయణరెడ్డి, డీబీటీ మేనేజర్ లక్ష్మీనారాయణలకు అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కురుమయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నారాయణగౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జగన్, జిల్లా ఉపాధ్యక్షులు వి హనుమంతు. ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు అంజన్న. జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ నాయక్, నాయకులు పాల్గొన్నారు.

నేడు భూ భారతి అవగాహన సదస్సు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలో శనివారం స్థానిక యుబీ గార్డెన్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు భూ భారతి పథకంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘన్సీరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు కలెక్టర్ విజయేందిరబోయి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సదస్సును మహబూబ్‌నగర్ అర్బన్ రైతులు హాజరు కావాలని కోరారు.

భూ భారతి చట్టం తెలుసుకోవాలి

మహబూబ్‌నగర్ రూరల్: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై అర్బన్ మండల రైతులకు అవగాహన కల్పించేందుకు శనివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు నాయబ్ తహసీల్దార్ దేవేందర్ కేసిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్బన్ మండల పరిధిలోని రెవెన్యూ గ్రామాల రైతులు అధిక సంఖ్యలో సదస్సుకు తరలివచ్చి భూ భారతి చట్టం గురించి తెలుసుకోవాలని కోరారు.

హజ్ యాత్రికులకు సన్మానం

జడ్చర్ల: హజ్‌యాత్రకు వెళ్తున్న పలువురిని నిమ్మబాయిగడ్డ మదిన మసీద్‌లో శుక్రవారం సన్మానించారు.యాత్ర దిగ్విజయంగా పూర్తి చేసుకుని రావాలని పలువురు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మసీద్ అధ్యక్షులు మోయిజొద్దీన్, అబ్దుల్‌రషీద్, గౌస్, ఖయ్యూం, మజార్, నిజాం, ఖాజా పాల్గొన్నారు.

‘గంజాయి వాడకం, అక్రమ రవాణా నిర్మూలిద్దాం’

మద్దూరు: నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలంతో శుక్రవారం మద్దూరు పట్టణంలోని కిరాణా, పాన్ షాపులు, అనుమానంగా ఉన్న పంటపొలాల్లో, ఇతర ప్రదేశాల్లో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలన, అక్రమ రవాణా జరుగకుండా మద్దూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు వినియోగిస్తున్నా, రవాణ చేసినా వెంటనే డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచతామనన్నారు. తనిఖీల్లో నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కీ, డాగ్ హ్యాండ్లర్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన



నవాబుపేట: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను మండల అధికారుల బృందం పరిశీలన ప్రారంభించింది. శుక్రవారం ఎంపీడీఓ జయరాంనాయక్ అధ్యక్షతన మండలంలోని వివిధ శాఖల అధికారులు, ఎస్‌బీఐ, కెనరా, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ తదితర బ్యాంకుల అధికారులు కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాలు రాగానే వాటి గ్రౌండింగ్ కోసం ముందుకు వెళ్తామని వారు వివరించారు. మండలంలో రాజీవ్ యువ వికాసానికి మొత్తం 2912 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. వీటిలో బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి 1702, ఎస్సీ కార్పొరేషన్ 596, ఎస్టీ కార్పొరేషన్ 465, మైనార్టీ కార్పొరేషన్ 12 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

చిన్నచింతకుంట: పారదర్శకంగా రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో చిన్నచింతకుంట, ఉంద్యాల బ్యాంకర్లు, సిబ్బందితో రాజీవ్ యువ వికాసం పథకంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి 1712 దరఖాస్తు లు వచ్చినట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని పేర్కొన్నారు.

‘ఉగ్ర’దాడికి వ్యతిరేకంగా నిరసన



నవాబుపేటలో కొవ్వొత్తులతో మృతులకు నివాళులు



జడ్చర్లలో ఐఎంఏ ఆధ్వర్యంలో మృతులకు కొవ్వొత్తులతో ఘన నివాళులు



మహబూబ్‌నగర్ జామీయా మసీదు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు



జిల్లా కేంద్రంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా శుక్రవారం జుమా నమాజ్ అనంతరం ముస్లింలు నిరసన చేపట్టారు. స్థానిక జామీయ మసీద్ ఎదుట మిల్లీ మహాజ్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాకిస్తాన్ ప్రధాని, జనరల్‌ల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఉగ్రదాడిలో మరణించిన కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. కార్యక్రమంలో మిల్లీ మహాజ్ చీఫ్ ప్యాట్రన్ అన్వర్‌పాష, కన్వీనర్ తఖీ హుస్సేన్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అబ్దుల్ రహెమాన్, ఆల్‌పార్టీ ముస్లిం లీడర్స్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ మోసిన్‌ఖాన్, ముస్లిం సంఘాల ప్రతినిధులు మిర్జా ఖుద్దూస్‌బేగ్, హాఫిజ్ ఇద్రీస్, అబ్దుల్లా సున్నీ, అబ్దుల్ రషీద్, నయిమ్ ఇమ్రాన్, మహ్మద్ ఫయాజ్, మహ్మద్ సాధిక్ హుస్సేన్, మహ్మద్ హాశీం, మహ్మద్ మొయిజ్, మహ్మద్ అజహర్, నురూల్లాఖాన్, ఆబిద్ మొహియొద్దీన్, బషీర్‌ఖాద్రీ, నయిం అన్సారీ, షేక్ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

అల్‌ఫైజ్ సొసైటీ ఆధ్వర్యంలో..

ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని మసీద్ ఎదుట అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ, యువత నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

- విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేశారు.
- దేవరకద్రలో ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి జమా మసీదులో ప్రార్థనలు చేశారు. మృతుల ఆత్మలకు శాంతి కలగాలని మౌనం పాటించారు. కౌకుంట్ల మండల కేంద్రంలో ముస్లింలు జమా మసీదు వద్ద ప్రార్థనలు చేశారు.
- మిడ్జిల్ మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దాడిలో మరణించిన కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలుగాలని మౌనం పాటించారు.
- జడ్చర్ల పట్టణంలో ఐఎంఏ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి నేతాజీచౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. తెలంగాణ వైద్య మండలి రాష్ట్ర కార్యదర్శి సుజీత్‌కుమార్, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్లు, లయన్ రాంరెడ్డి, డ్రగిస్ట్ ఫార్మసిస్ట్ అసోసియేషన్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఐఎంఎస్ యూనివర్సిటీలో..

ఉగ్రదాడిని నిరసిస్తూ మండలంలోని పోలేపల్లి ఎన్‌ఐఎంఎస్ యూనివర్సిటీలో సిబ్బంది, విద్యార్థులు మౌనం పాటించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎస్‌వీకేఎం సంస్థలు, ఎన్‌ఎంఐఎంఎస్ విశ్వవిద్యాలయాల్లో మొత్తం 65 వేల మంది ఒకేసారి మౌనం పాటించినట్లు ప్రకటించించారు.

- అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాల్లో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన మృతులకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు నివాళులర్పించారు. కొవ్వొత్తులను వెలిగించి సంతాపం వ్యక్తం చేశారు.
- నవాబుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జోగుళాంబ గద్వాల జోన్ –7 నుంచి టీఎస్‌పీఎస్సీ ద్వారా ఎస్సీ సంక్షేమశాఖ పరిధిలో ఇటీవల ఎంపికైన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు శనివారం జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు ఎస్సీడీడీ సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు కార్యాలయం వద్దకు చేరుకోవాలని, అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, అటెస్టెడ్ చేసుకొని తీసుక రావాలని తెలిపారు.